

అగ్నివీర్‌కు 25 మంది ఎన్‌సిసి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇటీవల నిర్వహించిన అగ్నివీర్ ఎంపికలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన 25 మంది ఎన్‌సిసి విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడు తెలిపారు. ఎంపికైన అగ్నివీర్‌లను కళాశాలలో శుక్రవారం అభినందించారు. 2025లో ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న తరుణ్ కళ్యాణ్‌తో పాటు ఎన్‌సిసిలో బి, సి సర్టిఫికెట్ పొందిన విద్యార్థులు ఎంపికైన వారిలో ఉన్నట్లు తెలిపారు. ఎన్‌సిసిలో మెరుగైన శిక్షణ, దేహ దారుఢ్య శిక్షణ, క్రమశిక్షణ, మెరుగైన ప్రమాణాలతో కూడిన విద్య వల్ల ఈ ఎంపికలు సాధ్యమయ్యాయన్నారు.

ఈసారైనా చర్చ జరిగేనా..?

- గత సమావేశంలో ప్రోటోకాల్ సమస్యతో వైసిపి సభ్యుల వాకౌట్
- మంత్రితో సహా ఒక్క కూటమి ఎమ్మెల్యే కూడా హాజరు కాని వైనం
- ప్రజా సమస్యలపై చర్చించకుండానే ముగిసిన సమావేశం
- ఈ సమావేశంలోనైనా సమస్యలపై చర్చిస్తే ప్రజలకు మేలు

జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు జిల్లాలోని ఆయా మండలాలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధులు. ఆ సభ్యులు మండలాల్లోని ఏదో గ్రామం నుంచి ఎన్నిక కావడంతో, దాదాపు వారికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుస్తాయి. ఇటువంటి సమస్యలను ప్రస్తావించడానికి జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం ఒక వేదిక. అటువంటి వేదికను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో సహా కూటమి ఎమ్మెల్యేలు చాలా తేలిగ్గా తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. పాలకవర్గంలో అత్యధిక మంది వైసిపి సభ్యులే ఉండడంతో, వారికి తామెందుకు సమాధానం చెప్పాలన్న ఉద్దేశంతో దుమ్మా కొడుతున్నారు. గత సమావేశానికి ఒక్క కూటమి ఎమ్మెల్యే హాజరు కాలేదు. సమావేశానికి హాజరైన వైసిపి సభ్యులు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రోటోకాల్ సమస్యతో వాకౌట్ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించే ఈ సమావేశంలోనైనా అధికార, ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలపై చర్చిస్తే ప్రజలకు కాస్త అయినా మేలు చేకూరుతుంది.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రస్తుత రబీ సీజన్‌లోనూ జిల్లాలో ఎరువుల కొరత సమస్య తలెత్తుతోంది. జిల్లాలో యూరియా కొరత లేదని అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం రైతుల అవసరాలకు 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉంది. గత నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు 7,811 మెట్రిక్ టన్నులను మాత్రమే అందించారు. పిఎసిఎస్‌లు, రైతుసేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్, ప్రైవేట్ డీలర్ల వద్ద కలిపి కేవలం 2,020 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు, భూసేకరణకు నిధులు ఇవ్వకపోవడంతో, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి.

87, 88 ప్యాకేజీ పనుల పూర్తికి భూసేకరణ బిల్లుల చెల్లింపే ప్రధాన అడ్డంకిగా ఉంది. 87 ప్యాకేజీ పనుల పూర్తికి 69 ఎకరాలు కావాల్సి ఉంది. వీటి కోసం రూ.8.84 కోట్లను చెల్లించాల్సి ఉంది. అదేవిధంగా 88 ప్యాకేజీ పనుల పూర్తికి 28.45 ఎకరాలు కావాల్సి ఉంది. ఇందుకోసం రూ.3.17 కోట్లు చెల్లించాల్సి ఉంది. భూసేకరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన డబ్బులు అందుబాటులో ఉన్నా, భూసేకరణ అధికారుల తీరుతో నిలిచిపోయింది. హిరమండలం రిజర్వాయర్ పనులు చేపడుతున్న సోమా-పటేల్ సంస్థకు రూ.26.07 కోట్ల మేర బిల్లులు బకాయి పడినట్లు తెలుస్తోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి పనులు ఏ దశలో ఉన్నాయో అక్కడే నిలిచిపోయాయి. గొట్టాబ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు 45 శాతం పనులే జరిగాయి. సంబంధిత నిర్మాణ సంస్థకు పనులు చేసిన మేరకు రూ.30 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

● అమాత్యుల ప్రయత్నం ఎంతవరకు వచ్చిందో..?

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడ్డ అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. దాదాపు 15 ఏళ్లు గడుస్తున్నా కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు ప్రాంతాల్లో గోదాముల్లో సుమారు రూ.ఐదు కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. ఇటీవల నిర్వహించిన డిఆర్‌సి సమావేశంలో ఆ సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులతో తాను మాట్లాడతానని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీనిచ్చిన నేపథ్యంలో ఈ ప్రయత్నం ఎంతవరకు వచ్చిందో చూడాల్సి ఉంది.

● రూ.50.33 కోట్ల మేర ఇళ్ల బకాయిలు

జిల్లాలో 2014 నుంచి 2018 వరకు నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు ఇప్పటికీ ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. ఇళ్ల కేటాయింపులు, నిర్మాణాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలతో ప్రభుత్వం వాటికి డబ్బులు ఆపేసింది. ఇళ్లను పరిశీలించి డబ్బులు చెల్లిస్తామని చెప్పినా, ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. జిల్లాలో సుమారు 37,215 ఇళ్లకు రూ.50.33 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తి చేసి ఆరు నెలలు కావస్తున్నా, ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

- 'విబి-జి రాం జి' బిల్లును ఉపసంహరించుకోవాలి
- కేంద్రంపై టిడిపి, జనసేన ఒత్తిడి తీసుకురావాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



శ్రీకాకుళం సిటీ : గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గ్రామీణ పేదల జీవనోపాధిలో కీలకపాత్ర పోషిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ దాని స్థానంలో 'విబి-జి రామ్ జి' పేరుతో తీసుకువచ్చిన బిల్లును ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యాన నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్ధ హక్కుగా ఉన్న ఉపాధి హామీని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి-జి రాం జి) పేరుతో ఉపాధి హామీ చట్టనికి రాం రాం పలకనున్నారని అన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదో సాధారణ పథకంగా అమలు చేయనున్నారని చెప్పారు. ఇప్పటివరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్‌ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని బట్టి పనులు పెట్టడమంటే ఉపాధి చట్టం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనన్నారు. మోడీ ప్రభుత్వం ఈ చట్టంలోని మహాత్మాగాంధీ పేరును తొలగించి ద్రోహం చేస్తోందన్నారు. ఉపాధి హామీ అమల్లో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని తెలిపారు. ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించిన విషయాన్ని గుర్తుచేశారు. వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల ఉపాధిని సస్పెండ్ చేసి, ఈ పథకాన్ని రైతులకు పోటీగా మారుస్తుందని విమర్శించారు. ఈ చట్టం అమలుకు ఇప్పటివరకు కేంద్రం ఇస్తున్న శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై రూ.వేల కోట్ల అదనపు భారం మోపుతున్నారని తెలిపారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు రూ.నాలుగు వేల కోట్ల అదనపు భారం పడనుందన్నారు. ఇప్పటికే రూ.లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రం ఈ అదనపు భారాన్ని ఎలా భరించగలదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంటులో దీన్ని వ్యతిరేకించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జి.సింహాచలం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 22వ తేదీన వామపక్షాల ఆధ్వర్యాన చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోలాకి ప్రసాదరావు, ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాష్, ఎ.లక్ష్మి, మహేష్, ఎం.లలిత, అల్లు సోమశేఖర్, చందు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నోటికి నల్ల రిబ్బన్లతో మౌన దీక్ష

కొత్తూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ దాని స్థానంలో 'విబి-జి రామ్ జి' పేరుతో తీసుకువచ్చిన బిల్లును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని ఇరపాడులో గాంధీ విగ్రహం ఎదుట నోటికి నల్ల రిబ్బన్లు కట్టి మౌన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాదరావు, గంగరాపు ఈశ్వరమ్మ, అన్నపూర్ణ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు : నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ పాఠశాల్లో 'ముస్తాబు'

నేటి నుంచి జిల్లాలో అమలు

ప్రజాశక్తి - టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై విద్యాశాఖ దృష్టిసారించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన 'ముస్తాబు' కార్యక్రమం విజయవంతం కావడంతో, రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనుంది. ఇందులో భాగంగా పాఠశాలకు వచ్చే విద్యార్థి చేతి గోళ్లు శుభ్రంగా ఉన్నాయా? లేవా?, తలదువ్వుకున్నారా? లేదా?, మంచి దుస్తులు వేసుకున్నారా? లేదా? అన్నది ఉపాధ్యాయుడు పరిశీలించి విద్యార్థితో అమలు చేయించాలి. ఇందుకోసం పాఠశాలల్లోని తరగతి గదిలో ఆద్దం, దువ్వెన, నెయిల్‌కటర్, ముస్తాబు పెట్టె, సబ్బు ఏర్పాటు చేయనున్నారు. వాటిని విద్యార్థి వినియోగించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలి. ఇందుకోసం ఉపాధ్యాయులు ఒక్కో విద్యార్థికి ఐదు నిమిషాల చొప్పున సమయాన్ని కేటాయించాలి. విద్యార్థి వాష్‌రూమ్‌ను వినియోగించిన వెంటనే చేతుల్ని సబ్బుతో శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయుడు చర్యలు తీసుకోవాలి. ముస్తాబు కార్యక్రమం పాఠశాల్లో అమలు చేస్తున్నారా? లేదా? అన్నది పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించి, ప్రతి వారం నివేదికను పై అధికారులకు పంపాలి. ఈ కార్యక్రమం అమలు తీరుపె పర్యవేక్షణకు ఒక కమిటీ ఉంటుంది.

8 ధాన్యం బస్తాలు దగ్ధం

ప్రజాశక్తి - మందస

మండలంలోని జిల్లుండ గ్రామం వరి పొలాల్లో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కొల్లి కృష్ణారావుకు చెందిన సుమారు ఎనిమిది బస్తాల ధాన్యం అగ్నికి ఆహుతైంది. వరి కోత మిషన్‌తో పొలాలు కోసి వృథాగా వదిలేసిన గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పొలాల్లోని వరిగడ్డికి నిప్పు అంటుకొని మంటలు అంటుకున్నాయి. దీంతో రైతులు పొలాల్లో వదిలిన ధాన్యం రాశులు రోడ్డుపైకి తెచ్చి భద్రపరచగా, మరికొంతమంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.



ధాన్యం కొనుగోలులో జాప్యం వద్దు

ప్రజాశక్తి - ఆమదాలవలస

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష మిల్లర్లను ఆదేశించారు. మిల్లర్లపై రైతుల ఫిర్యాదుల నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశాల మేరకు రాష్ట్ర గిడ్డంగుల కార్యాలయంలో ఆర్‌డిఒ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని అందిస్తున్నా, మిల్లర్లు ఎఫ్‌సిఐకి పంపే బియ్యంలో నూక శాతం ఎక్కువగా వస్తోందని చెబుతూ గిడ్డంగులకు తీసుకొచ్చిన బియ్యం లారీల లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియను అధికారులు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి జాప్యం కాకుండా చూడాలని మిల్లర్లను ఆదేశించారు. మిల్లర్లు తప్పుడు విధానాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్‌డిఒ హెచ్చరించారు. తనిఖీల్లో తహశీల్దార్ ఎస్.రాంబాబు, వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ వైకుంఠరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



బియ్యంలో నూక శాతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

వైజ్ఞానిక ప్రదర్శనలో మేధోమదనం

రాష్ట్రస్థాయికి 11 ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబు తెలిపారు. మండలంలోని మునసబుపేటలో గల గురజాడ విద్యాసంస్థల ఆవరణలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారంతో ముగిసింది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ ప్రదర్శనలో చిన్నారుల ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు మొత్తం 310 సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. వ్యవసాయం, పర్యావరణం, ఆరోగ్యం, గణిత నమూనాలు వంటి విభిన్న విభాగాల్లో ప్రాజెక్టులు అందరినీ ఆలోచింపజేశాయి. ప్రదర్శించిన నమూనాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 11 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వీటిలో 7 గ్రూపు ప్రాజెక్టులు, 2 వ్యక్తిగత ప్రాజెక్టులు, 2 ఉపాధ్యాయుల ప్రాజెక్టులు ఉన్నాయి. రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థులు, మార్గదర్శక ఉపాధ్యాయులను డిఇఒ ప్రత్యేకంగా అభినందించారు. ముగింపు వేడుకలో ఉప విద్యాశాఖాధికారులు ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విజయవాడలోని లోక్ భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ, టైపిస్ట్ మురళికి ఉత్తమ అవార్డులు అందజేశారు. సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ వి.వెంకటరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సత్యప్రసాద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.



జీడిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

ప్రజాశక్తి - కవిటి

జీడి పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి.హరికుమార్ తెలిపారు. జీడి పంటలో వచ్చే పురుగులు, తెగుళ్ల నివారణపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడితోటల్లో ప్రస్తుతం కనిపిస్తున్న కాండం, వేరు తొలుచు పురుగు, ఇతర హానికారక పురుగుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ముఖ్యంగా పురుగుల దాడి ప్రారంభ దశలోనే గుర్తించి తగిన మందులు పిచికారీ చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. పంట దశను బట్టి క్లోర్పైరిఫాస్, లాండ సైహలోత్రిన్, ప్రొపెనోఫాస్, మోనోక్రోటోఫాస్, ఎసిఫేట్, డైక్లోర్వోస్ వంటి మందులను సూచించిన మోతాదులో వినియోగించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి మాధవీ లత, టి.బాలరాజు, హెచ్ఇఒ, విఎఎలు, విఎహెచ్ఎలు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న హరికుమార్

పిపిపికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) విధానానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని సూర్యమహల్ కూడలిలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిపిపి విధానం ద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ వైద్య కళాశాలలను నిర్మించి, రాష్ట్రంలో వైద్యుల కొరతను తీర్చవచ్చని తెలిపారు. కళాశాలల నిర్వహణలో ప్రైవేటు భాగస్వామ్యం ఉన్నా.. యాజమాన్య హక్కులు, సీట్ల కేటాయింపుపై పూర్తి నియంత్రణ ప్రభుత్వానిదే ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ సాగుతోందని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. వైద్య విద్యను సామాన్యుడికి చేరువ చేసేందుకే ఈ విధానమని చెప్పుకొచ్చారు. సుపరిపాలన ద్వారానే సామాన్యుడికి సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు, గౌతు శిరీష, కూన రవికుమార్, మామిడి గోవిందరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో రూ.6012 కోట్ల వ్యవసాయ రుణాలు

ప్రజాశక్తి - పలాస

2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.6012 కోట్ల వ్యవసాయ రుణాలు మంజూరు చేసినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల బ్యాంకర్లు, వెలుగు అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.9,230 కోట్ల రుణాలు మంజూరు చేసేందుకు లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు రూ.6012 కోట్లు మంజూరు చేశామన్నారు. డ్వాక్రా మహిళలకు రూ.2,400 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.1400 కోట్ల రుణాలు మంజూరు చేశామని చెప్పారు. మార్చిలోగా వ్యవసాయ, డ్వాక్రా రుణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఇందుకు వ్యవసాయ శాఖ, వెలుగు అధికారులు బ్యాంకర్లు సహకరించాలని సూచించారు. సమన్వయం లేకపోవడం వల్లే లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నామని, ఈ విషయాన్ని బ్యాంకర్లు, సంబంధిత అధికారులు గమనించాలన్నారు. డ్వాక్రా రుణాల మంజూరులో సమస్యలు ఉంటే, తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించి రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపడతామన్నారు. పొదుపు సొమ్ములో సగం డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ డిపిఎం నాగలక్ష్మి, ఎంపిడిఒ వసంత కుమార్, ఎపిఎంలు జాంబవతి, కూర్మారావు, ప్రసాదరావు, పలాస మున్సిపల్ మెప్మా అధికారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డిఎం శ్రీనివాసరావు

స్వాభిమాన్‌కు 9 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అర్జీల పరిష్కారంలో జాప్యం కారాదని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్)లో వినతులు స్వీకరించారు. ఈ గ్రీవెన్స్‌కు తొమ్మిది అర్జీలు వచ్చాయి. అందులో వికలాంగుల సంక్షేమ శాఖకు సంబంధించి నాలుగు, డిఆర్‌డిఎకు సంబంధించి ఒకటి, సదరం సర్టిఫికెట్ కోసం నాలుగు వినతులు వచ్చాయి. వికలాంగుల సంక్షేమ శాఖలో వచ్చిన నాలుగు దరఖాస్తుల్లో రెండు దరఖాస్తులు పరిశీలించి సరుబుజ్జిలి మండలం సింధువాడకు చెందిన కె.రామకృష్ణ, ఎచ్చెర్ల మండలం జరజాంకు చెందిన జరుగుల్ల రమణకు మూడు చక్రాల వాహనాలను జెసి అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి బి.శైలజ, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న విద్యాశాఖాధికారులు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కన్నయ్య మాస్టర్ ఎడ్యుకేషనల్ ఛారిటీ ద్వారా యుటిఎఫ్ సిద్ధం చేసిన మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేపట్టారు. శుక్రవారం దాదాపు రూ.60 వేలు విలువ చేసే 700 పుస్తకాలను వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 70 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ సుజాత కింతలి, మండల విద్యాశాఖ అధికారులు బి.వెంకటరమణ, దాశరథి, యుటిఎఫ్ మండల సెక్రటరీ సురేష్, జయరాం, సుగుణ, అంజన్, నువ్వలరేవు మాజీ ఎంపిటిసిలు ఆనంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న విశ్రాంత డిఎస్‌పి ప్రసాదరావు

విద్యార్థులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక కస్తూరిబా పాఠశాలలో చలితో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి ప్రసాదరావు 'బానమ్మ, రాములమ్మ ట్రస్ట్, జగతి, అరియ ఆస్పత్రి మధురవాడ' తరుపున దుప్పట్లు, చాపలను సుమారు 150 మంది విద్యార్థులకు అందించారు. ప్రసాదరావు దాతృత్వానికి పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన హెల్పింగ్ హాండ్స్ సభ్యులకు ప్రిన్సిపాల్ డాక్టర్ శిరీష ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఎస్.విశ్వనాథం, అధ్యాపకులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన పాతపట్నం జట్టు

క్రికెట్ టోర్నీ విజేత పాతపట్నం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న లీగ్ క్రికెట్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఉపాధ్యాయులకు మానసిక ఆనందం కల్పించాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఫైనల్‌లో ఎల్.ఎన్.పేట, పాతపట్నం మండలాలకు చెందిన టీమ్‌లు పోటీపడగా పాతపట్నం విజేతజట్టుగా నిలిచింది. డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్ చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఇక్కడ పోటీల్లో విజేతగా నిలిచిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని జోనల్ ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు దల్లి తులసీరావు రెడ్డి, దాసుపురం చిన్నారావు, సవర దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభం, మణికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు కె,.కె.రామిరెడ్డి, లక్ష్మణరాజా, కె.శ్యామలరావు, వెంకటరమణ, మోహన్‌బాబు, నీలకంఠేశ్వరరావు, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సిఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో ఎంతోమంది పేదలకు సిఎం సహాయనిధి ద్వారా ప్రత్యేక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. హైదరాబాద్ పట్టణంలోని నిమ్స్ ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమదాలవలస మండలం గోపీనగర్‌కు చెందిన మహిళకు 24 గంటల్లోనే ఎమ్మెల్యే రవికుమార్ సిఎం సహాయనిధి నుంచి రూ.6 లక్షలు మంజూరు చేయించడంపై పలువురు రవికుమార్‌కు అభినందనలు తెలిపారు. గోపీనగర్‌కు చెందిన తమ్మినేని పార్వతి నిమ్స్ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగంలో ఆర్థికస్తోమత లేక ప్రాణాపాయ స్థితిలో ఉన్న విషయాన్ని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సిఎం సహాయనిధి విభాగ అధికారులతో మాట్లాడి ఆ కుటుంబానికి వైద్య సహాయం అందించడానికి చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే రవికుమార్ స్వగృహం వద్ద బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు.



మానవహారం చేపడుతున్న ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు

పోలియోపై మానవహారం

టెక్కలి రూరల్: స్థానిక అంబేద్కర్ జంక్షన్‌లో పోలియోపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మానవహారం చేపట్టారు. టెక్కలిలో శుక్రవారం పోలియో చుక్కలపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ నెల 21న పోలియో చుక్కల కార్యక్రమం సందర్భంగా కె.కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. గాయత్రి పర్యవేక్షణలో టెక్కలిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలను చైతన్యపరుస్తూ ర్యాలీ, మానవహారం చేపట్టారు. 'పోలియో రహిత సమాజం నిర్మిద్దాం - నిండు జీవితానికి రెండు చుక్కలు' వంటి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- రణస్థలం

లావేరు మండలం అల్లినగరం జెడ్‌పిహెచ్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన కబడ్డీ పోటీల్లో రణస్థలం మండలం లంకపేట కెజిబివి పాఠశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. అల్లినగరం జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ హెచ్ఎం ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు చేతులమీదుగా విద్యార్థులు బహుమతి తీసుకున్నారు. కెజిబివి ప్రిన్సిపాల్ ఎస్. హైమవతి, పిఇటి పావని విద్యార్థులను అభినందించారు.

మత్తు రహిత సమాజ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

మత్తు రహిత సమాజ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన అభ్యుదయం సైకిల్‌యాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సత్యవరం జంక్షన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ మత్తు రహిత సమాజ నిర్మాణమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'అభ్యుదయం సైకిల్‌యాత్ర' గొప్ప సామాజిక ఉద్యమమని అభివర్ణించారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. మత్తు పదార్థాలు వ్యక్తి జీవితాన్నే కాదు, కుటుంబం, సమాజం భవిష్యత్‌నూ నాశనం చేస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, డిఎస్‌పి లక్ష్మణరావు, సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్, అశోక్ బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: యువత డ్రగ్స్‌బారిన పడవద్దని, బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, బిసి కళింగ వైశ్య కార్పోరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న అభ్యుదయ సైకిల్‌యాత్ర చేస్తున్న పోలీసులను మండలంలోని జాతీయ రహదారి వాంగ్రాడ



నరసన్నపేట : ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

వద్ద నయార పెట్రోల్ బంకు వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు వెయ్యి కిలోమీటర్లు అభ్యుదయ సైకిల్ యాత్ర జరిగిందని వారు తెలిపారు. ఈ సైకిల్ యాత్ర చిన్నబమ్మిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు నిమ్మాడ, గట్లపాడు, వాంగ్రాడ, ఎత్తురాళ్లపాడు తదితర గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, అశావర్కర్లు, టెక్కలి సిఐ కె.శ్రీనివాసరావు, కోటబొమ్మాళి, నౌపడ, సంతబొమ్మాళి, నందిగాం ఎస్ఐలు సత్యన్నారాయణ, నారాయణస్వామి, సింహాచలం, షేక్‌మహ్మద్‌ఆలీతో పాటు ఐసిడిఎస్ పిఒ సిహెచ్ హైమావతి, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, పెద్దబమ్మిడి మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు, నాయకులు చల్ల అప్పలనాయుడు, ఉపాధిహామీపిఒ జి.హరిప్రసాద్, టిసి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఘంటసాల శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి- అరసవల్లి

ఈనెల 21న హైదరాబాద్‌కు చెందిన కిన్నెరా ఆర్ట్స్ థియేటర్స్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆడిటోరియంలో 2025కు గాను 118 ఘంటసాల ఆలపించిన పాటలతో 60మంది గాయని, గాయకులతో 12 గంటల నిర్విరామ ఘంటసాల పాటల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కిన్నెరా ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి ముద్దాలి రఘురాం, కె. సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ క్యాంప్ కార్యాలయంలో ఘంటసాల ఆరాధనోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘంటసాల ఆరాధన ఉత్సవాలు నిర్వహించడం ఆనందదాయకమైన విషయమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శ్రీకాకుళంలో ఉన్న గాయకులను కూడా ప్రోత్సహించి పాటలు పాడినట్లు చూడాలని కోరారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ 1994 నుంచి నిర్విరామంగా ప్రతి జిల్లాలో కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించామని, ఈనెల 21న కూడా అదే విధంగా 12 గంటల పాటు ఘంటసాల ఆరాధనోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం



పోస్టర్ అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చెందిన ప్రముఖ గాయకులు బి.ఎ నారాయణ బృందంతో పాటల కార్యక్రమం ప్రారంభమై, శ్రీకాకుళం గాయకులు, హైదరాబాద్‌కు చెందిన అమలాపురం కన్నారావు, శరత్, విఆర్‌కె ఫణి, గంటి రామకృష్ణ, బాల కామేశ్వరరావు, చంద్ర తేజ ప్రముఖ యువ గాయకులు కారుణ్య ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలో పాల్గొని ఘంటసాల పాటలతో ఘంటసాలకు నీరాజనం పలుకుతారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు కారుణ్యకు ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల ఆరాధన ఉత్సవ కమిటీ ప్రతినిధులు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, జంధ్యాల శరత్ బాబు, మండ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్లస్టర్ సముదాయాలు

టెక్కలి: విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహిస్తున్న క్లస్టర్ సముదాయాలు శనివారం నిర్వహించనున్నారు. గతనెల నుంచి స్కూల్ అసిస్టెంట్లుకు మండల కేంద్రంలోనే నిర్వహిస్తున్నారు. శనివారం మెదటిపూట యధావిధిగా తరగతులు నిర్వహణ జరిగిన వెంటనే విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఆందించిన తర్వాత రెండో పూట క్లస్టర్ సముదాయాలకు ఉపాధ్యాయులు హజరు కానున్నారు. డిసెంబర్ నెలకు సంబంధించిన పాఠ్యాంశాలపై తరగతులు నిర్వహణ చేపట్టనున్నారు. ఉపాధ్యాయుల మాదిరి పాఠ్యాంశం బోధన మారుతున్న విద్యావిధానం ఆవగాహన చేసుకుని తరగతిగదిలో వాటిని వినియోగించేలా చర్యలు తీసుకునేందుకు క్లస్టర్ సముదాయాలు వినియోగంలోకి రానున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు మాత్రం గతంలో నిర్వహించే క్లస్టర్ సముదాయాలకే హజరు కానున్నారు.

రేపు పల్స్ పోలియో

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో ఈనెల 21న ఆదివారం పల్స్‌పోలియో సందర్భంగా 3,823 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. మండలంలోని కె.కొత్తూరు, లింగాలవలస పిహెచ్‌సిల పరిధిలో 0-5 ఏళ్ల చిన్నారులు 3,823 ఉండగా, 67 బృందాలు, 36 బూత్‌లు, నాలుగు మొబైల్ టీమ్స్ ద్వారా పోలియో చుక్కలు కార్యక్రమం జరగనున్నట్లు కె.కొత్తురు, లింగాలవలస పిహెచ్‌సి వైద్యులు గాయత్రి, డా.పవన్ తేజ తెలిపారు.



నిర్వహిస్తున్న గ్రామసభ

'ఉపాధి' సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జాతీయ గ్రామీణ ఉపాధిహామీకి సంబంధించిన పన్నులపై సామాజిక తనిఖీలు పారదర్శకంగా, జవాబుదారీ తనంగా నిర్వహించాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్ హిమగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. మండలంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, వేతనాలు మెటీరియల్ రూపంలో రూ.63.73 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఉపాధిహామీ నిధుల ద్వారా పనులు చేపట్టిన రహదారులు, ప్రహరీగోడలు, ఇతరపనులపై సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. మున్ముందు సామాజిక తనిఖీ పారదర్శకంగా, ప్రజలకు ఉపాధి కూలీలకు జవాబుదారీగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణ రెడ్డి, కార్యదర్శి కిషోర్, సర్పంచ్ ప్రతినిధి వాసు, ఎంపిటిసి ప్రతినిధి జయమునిరావు తదితరులు పాల్గొన్నారు.

జల్లపల్లిని పంచాయతీ చేయాలి

ప్రజాశక్తి- నందిగాం

జల్లపల్లి గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన పలువురు ఎంపిడిఒ కుమార్ పట్నాయక్ శుక్రవారం వినతిపత్రం అందించారు. 540 ఓటర్లు గల జల్లపల్లి గ్రామం దేవలభద్ర పంచాయతీ నుంచి వేరుచేసి పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఆరంగి సత్యం, జె. గోవిందరావు, మురళీమోహనరావు తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రాష్ట్రస్థాయికి జెహెచ్‌ఎస్ ప్రాజెక్టు ఎంపిక

పొందూరు: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పృథ్వీరాజ్, దిలీప్‌లు



ఎంపికైన ప్రాజెక్టుతో గైడ్ టీచర్ షణ్ముఖరావు, విద్యార్థులు

ప్రదర్శించిన 'పేషెంట్స్ స్మార్ట్ హెల్త్ మోనటరింగ్ సిస్టమ్' ప్రాజెక్టు ఎంపికైనట్లు శుక్రవారం ఎంఇఒ-1, హెచ్ఎం ఎం.వాగ్దేవి తెలిపారు. శ్రీకాకుళంలోని మునసబుపేటలో గల గురజాడ విద్యాసంస్థల్లో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మొత్తం 250 ప్రాజెక్టులు పాల్గొనగా అందులో రాష్ట్రస్థాయికి మొత్తం 11 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని తెలిపారు. పేషెంట్స్ స్మార్ట్ హెల్త్ మోనటరింగ్ సిస్టమ్ ద్వారా రోగి హృదయ స్పందన, సెలైన్ స్థాయిలను సులభంగా పర్యవేక్షించవచ్చునో విద్యార్థులు తెలియజేశారు. డిఇఒ కె.రవిబాబు చేతులమీదుగా ప్రశంసాపత్రాలను విద్యార్థులు అందు కున్నారు. ఈనెల 23, 24 తేదీల్లో విజయవాడలోని రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించ నున్నారు. ఈ ప్రాజెక్టు గైడ్ టీచర్ షణ్ముఖరావుకు, విద్యార్థులకు ఎంఇఒలు ఎం.వాగ్దేవి, పి.రాజారావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

జీడి వ్యర్థాలను ఉపయోగించవచ్చు

ప్రజాశక్తి- పలాస

జీడి వ్యర్థాలను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చి ఉపయోగించవచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకట లక్ష్మీ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం జీడిపప్పు క్రూడ్ మిషనరీ సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల్లో వ్యర్థాలుగా భావించే పదార్థాలను తిరిగి ఉపయోగకరమైన, విలువైన ఉత్పత్తులుగా ఎలా మార్చవచ్చో విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించామన్నారు. పరిశ్రమ ప్రతినిధులు విద్యార్థులకు జీడి పిక్కల నుంచి నూనెను తీసే ఆధునిక విధానం, ఉప ఉత్పత్తులు ఆయిల్ తీసిన తర్వాత మిగిలే 'స్లడ్జ్' మరియు 'కేక్' తయారీ ప్రక్రియలను



జీడిపప్పు క్రూడ్ మిషనరీ సంస్థను పరిశీలిస్తున్న విద్యార్థులు

వివరించారు. వ్యర్థ పదార్థాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్, ఎగుమతి అవకాశాలను విద్యార్థులు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.మధు, కళాశాల నాక్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ, కామర్స్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.శాసనం పాఠశాలలో గణిత దశావధానం




విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మనసుపైన ఏకాగ్రత కేంద్రీకరించి గణన చేయడమే గణిత అవధానం అని గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మాస్టర్ అన్నారు. శుక్రవారం జాతీయ గణిత దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా మండలం కె.శాసనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెడ్మాస్టర్ పైడి గోపాలరావు అధ్యక్షతన జరిగిన 276వ గణిత దశావధానం కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి కంచిలి మండలం నుంచి హాజరైన గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మాస్టర్ గణితంలో వివిధ అంశాలైన ఘనమూలాలు, పంచమ మూలాలు, సమస్యా పూరణం, మనోసంకలనం, దత్తాంకం, దత్త భిన్నాంకం, వార గణన, వ్యస్తాంకం, 3ఐ3 గణిత చదరం, సరస ప్రసంగం మొదలగు వాటిపైన ప్రశ్నలకు క్షణాల్లో సమాధానాలు చెప్పి, చివరలో అవధాని చేసిన ధారణ కార్యక్రమం అంటే మొదటి నుంచి చివరి వరకు అడిగిన ప్రశ్న జవాబులు గుర్తు పెట్టుకొని, వరుసగా చెప్పడం అందరినీ ఆశ్చర్య పరచింది. ఈ సందర్భంగా హెచ్ఎం గోపాలరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థలకు గణితంపైన ఆసక్తి కలిగించుటకు దోహద పడుతుందని, తద్వారా విద్యార్థులకు పరిశోధనాభిలాష కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా అవధానిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ సిబ్బంది కామేశ్వరరావు, ఈశ్వరరావు, డిల్లేష్ మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వజ్రపుకొత్తూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపిడిఒ రమేష్ నాయుడు అన్నారు. శుక్రవారం అక్కుపల్లి శివసాగర్ సముద్రతీరంలో గ్రీన్‌ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం కోసం ప్రజలందరూ ఏకతాటిపై వచ్చి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కోరారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్ మాట్లాడుతూ పర్యావరణ కోసం, సమాజహితం కోసం ప్రజలతో పాటు యువత, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకారం చాలా అవసరం అన్నారు. మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే బాధ్యత అందరూ తీసుకోవాలని కోరారు. అనంతరం బీచ్ పరిసర




సముద్రతీరంలో చెత్త తొలగిస్తున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర చెత్తను గ్రీన్‌ఆర్మీ సభ్యులు తొలిగించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కొర్ల శ్రావణ్ కుమార్, సబ్‌ట్రెజరీ అధికారి పి.మన్మధరావు, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు మధుబాబు, ఉపాధ్యాయులు జగదీశ్వరరావు, బొకర దుర్యోధన, ముంజేటి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రెండుచోట్ల విధులు నిర్వహించలేం

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వ శాఖల్లో ప్రధాన మైనది రెవెన్యూ శాఖ. అటువంటి శాఖలో విధులు నిర్వహిస్తున్న విఆర్ఒ లకు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒలు

గ్రామవార్డు సచివాలయల్లో విధులు అప్పజెప్పడంతో రెండు చేయలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని విఆర్ఒల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రగడ వేణుగోపాల్, కార్యదర్శి యారబాటి ప్రవీణ్ కుమార్, మండలశాఖ అధ్యక్షుడు బోర జగన్నాథం తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఒ సంఘం సభ్యులతో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ రాజారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విఆర్‌ఒలకు గ్రామంలో రెవెన్యూ పరంగా అనేక సమస్యలు ఉంటాయని, వాటితో ఫీల్డ్‌వర్క్ ఉంటుందని, అలాగని సచివాలయంలో వచ్చి బయోమెట్రిక్ వేయకపోతే ఆరోజు సెలవు పడుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు పాల్గొన్నారు.

విద్య ద్వారానే శాస్త్రీయ దృక్పథం

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్య ద్వారానే సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని, మూఢనమ్మకాలు లేని సమాజ నిర్మాణానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక పిలుపు నిచ్చింది. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కోట ఈశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంఇఒ కె.ఎ రాములు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలన్నారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చు కోవాల్సిన అవసరం ఉందన్నారు. జెవివి ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ మాట్లాడుతూ విద్యద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని, ప్రజలందరికీ శాస్త్రీయ విద్యను అందించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యతన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా విశేష సేవలు అందిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు గురుగుబెల్లి అప్పారావును జనవిజ్ఞాన



అప్పారావు మాస్టారును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేదిక జిల్లా కమిటీ పక్షాన ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పైడి రామస్వామి నాయుడు, ఇన్‌ఛార్జి హెచ్ఎం పైల రవికుమార్, ఉపాధ్యాయులు బి.ఎ. శివరాజ్, ఎం.వి.ఆర్. బట్లు, ఎస్.అరుణ, బి.శరత్ కుమారి, ఎం.ఉమా కుమారి, జి.కుమారి, ఎస్.సులోచన రాణి, షేక్ షావలి, టి.చంద్ర మనోహర్, సిహెచ్ నాగేశ్వరరావు, బి. శ్రీరామమూర్తి, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద మార్కెట్‌పై స్పష్టత ఇవ్వాలి

అరసవల్లి: నగరం నడిబొడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు పెద్దమార్కెట్‌పై టిడిపి నాయకులు తలో మాట చెబుతున్నారని, దీనిపై ఓ స్పష్టత ఇవ్వాలని వైసిపి వాణిజ్య విభాగం మాజీ అధ్యక్షుడు కోణార్క్ శ్రీను ఒక ప్రకటనలో డిమాండ్



శ్రీను

చేశారు. పెద్దమార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని కొందరు, పునర్నిర్మిస్తామని మరికొందరు చెబుతున్నారని, అసలు ఇందుకు సంబంధించి పాలనా అనుమతులు వచ్చాయా? నిధులు మంజూరయ్యాయో లోదో ముందు తెలపాలని, ఆ తర్వాత అక్కడున్న వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయం చూపిస్తే, అభివృద్ధి చేయడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. అసలు ఏ పద్ధతిలో మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నారో తెలపాలని, పిపిపి పద్ధతిలో అయితే ప్రస్తుతం ఉన్న ధరలకే షాపులు అందుబాటులోకి తెస్తారా? ఇప్పుడు మార్కెట్‌లో వ్యాపారం చేసున్నవారికి మళ్లీ ఎక్కడ ఇస్తారు? కేటాయింపులు ఎలా జరుపుతారు? అనేదానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. కేవలం ఆ పార్టీలో ఉన్న ఒకరిద్దరిపై ఆధారపడకుండా దీనికోసం ఒక కమిటీ వేసి వర్తకులందరికీ న్యాయం జరిగేలా ముందే అగ్రిమెంట్ కుదుర్చుకొని, ఆ తర్వాత పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. రెండురోజుల క్రితం పెద్దమార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే దీనిని పునర్నిర్మిస్తామంటూ ప్రకటించారని, అంతకు ముందు కూడా ఇదే విషయాన్ని పేర్కొన్నారని, దీనివల్ల మార్కెట్ వర్గాల్లో భయాందోళనలు వ్యక్తమవుతు న్నాయన్నారు. ఇప్పటికే మున్సిపల్ షాపులకు అద్దెలు చెల్లించలేని పరిస్థితిలో వ్యాపారులు ఉన్నారని, ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో దీన్ని నిర్మిస్తే మరింత అద్దెలు పెరిగే అవకాశం ఉన్నందున దీనిపై పునరాలో చించాలని ఆయన కోరారు. దీనిపై ఎమ్మెల్యే శంకర్ ఒక స్పష్టత ఇవ్వాలని శ్రీను ప్రకటనలో కోరారు.

ఐసిడిఎస్ పిఒపై ఫిర్యాదు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మెట్టురుగూడకు చెందిన అంగన్వాడీ సహాయకులు కుండగి నరసమ్మ మెట్టూరు అంగన్వాడీ కేంద్రంలో గత 30 ఏళ్లుగా పని చేస్తున్నారు. కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త మధురవేణి వ్యక్తిగత పనులపై సెలవుపెట్టి వెళ్లారు. ఈనెల 15న ఐసిడిఎస్ పిఒ ఉమా జానకి అంగన్వాడీ కేంద్రానికి వచ్చి స్టాక్ రిజిస్టర్ పరిశీలించి కేంద్రంలో.సెల్‌ఫోన్‌తో ఫోటోలు తీసి కార్యకర్త ఎక్కడని, అంగన్వాడీ కేంద్రమా, శ్మశానమా అంటూ సమాధానం చెప్పేలోపు దురుసుగా ప్రవర్తించి కులం పేరుతో దూషించి, చెంపమీద కొట్టి వెళ్లిపోయారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పిఒపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. మెట్టూరు అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ సహాయకులు నరసమ్మపై దాడికి నిరసనగా శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు.



వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు


ప్రభుత్వం మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్.వాసు దేవరావు అన్నారు. పొందూరు సచివాలయం -1,2,3 పరిధిలో శుక్రవారం వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి మనమిత్ర ద్వారా వాట్సాప్‌లో అందజేస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. వాట్సాప్‌లో సందేశం పంపడం ద్వారా ప్రభుత్వ విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను తెలియజేశారు. ఇంటి నుంచే మనకు అవసరమైన సేవలను ప్రజలు పొందవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ దుంపల అప్పన్న, ఇఒ పొన్నాడ జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ప్రకాష్

ప్రకాష్ ఉదారత

కవిటి: ఎంపిపి ప్రతినిధి, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ మరోసారి తన ఉదారత చాటు కున్నారు. మండలంలోని జి.కరాపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి రూ.10 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమ ంలో బంగారు తుంబయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

రట్టినిలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని రట్టిని చర్చిలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరవ్వడంతో క్రిస్మస్ సందడి నెలకొంది. ఈ వేడుకల్లో వసుంధర సర్పంచ్ సలాన అప్పల నాయుడు, రట్టిని సర్పంచ్ ప్రతినిధి శ్యామల జన్నా, మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు, ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, ఎస్.చంటి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్రిస్మస్ సందేశాన్ని తెలియజేస్తూ, ప్రేమ, శాంతి, పెంపొందించు కోవాలని పిలుపు నిచ్చారు. అనంతరం కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అల్లిమెరకలో క్విజ్ పోటీలు

మందస: ఈ నెల 22న సోమవారం గణిత దినోత్సవం సందర్భంగా అల్లిమెరక యువత ఆధ్వర్యంలో 6 నుంచి పదో తరగతి వరకూ క్విజ్ పోటీలు జరుపుతున్నామని యువత



గోవింద్

అధ్యక్షులు నవిరి గోవింద్ తెలిపారు. ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు. గెలుపొందిన టీంలకు ప్రథమ రూ.5,116, ద్వితీయ రూ.4,116, తృతీయ రూ.3,116 నగదు బహుమతులు ఉంటాయన్నారు. గౌరవ అతిధులుగా మందస ఎంఇఒలు పాల్గొననున్నారని తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

కవిటి: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాలని ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉదయం క్రీడా సామగ్రిని వితరణగా అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా సామగ్రి ఉపయోగించుకుని పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నెయ్యల విశ్వనాథం, యువజన సంఘం సభ్యులు ఆరింగి మధు, ఆరంగి త్రివిక్రమరావు, తెప్పల మోహనరావు, బెందాలం రంగారావు, బెందాలం చక్రధర్, పొల్లాయి మోరేసు రుద్రయ్య, పిన్నింటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బురిడి కంచరాంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బురిడికంచరాంలో ఎచ్చెర్ల రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి భద్రత, మాదకద్రవ్యాల నిషేధం, లింగ సమానత్వం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, ఎఒ డా.మునీరామకృష్ణ, డీన్ డా.శివరామకృష్ణ, ఎఫ్ఒ డా.సి హెచ్.వాసు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.పి.ముకుంధరావు, పిఒ టి.అసిరినాయుడు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని నైరా పంచాయతీలోని బిసి కాలనీకి సిసి రోడ్లు నిర్మాణాలకు శుక్రవారం సర్పంచ్ అరవల రామ్ ప్రతాప్, వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, మారుమూల ప్రాంతాలకు కూడా సిసి రోడ్లు వేసే ఘనత టిడిపిదే అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ కమిషనర్ ఇ.శ్రీనివాసులుకు సూచించారు. ఎల్లమ్మ వీధి, ఎర్ర చెరువు తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఇ శ్రీనివాసులతో పాటు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో గుర్తించిన సమస్యలు, పనులను గుర్తించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మన్మథరావు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఆమదాలవలస : మండలంలోని మునగవలస మలుపు వద్ద జొన్నవలస గ్రామాలతో పాటు పట్టణంలోని లక్ష్మీనగర్, రైల్వేస్టేషన్ ప్రధాన కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హెచ్చరిక బోర్డులను జి.ఎన్. జ్యుయలర్స్ దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలను నివారించి, వాహనదారులు, ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా చేయడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పూజారి కుటుంబానికి అండ

ప్రజాశక్తి- కవిటి

నెలవంక గ్రామ శివాలయ పూజారి రౌలో ఉమాపతి మృతి గ్రామాన్ని విషాదంలో ముంచింది. సుమారు 40 ఏళ్ల పాటు పూజారిగా సేవలందించిన ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. నెలవంక గ్రామ పెద్దలు, యువజన సంఘ సభ్యులు కలిసి ఉమాపతి కుమారుడు రౌలో సురేష్‌కు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా బైరెడ్లపుట్టుగ గ్రామ పెద్దలు మరో రూ.11 వేలు సహాయాన్ని అందించి మానవీయతను చాటారు. గ్రామ సేవకుడి కుటుంబానికి ఇరు గ్రామాల ప్రజలు కలిసికట్టుగా సహాయం చేయడం ప్రశంసనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

నిందితుడిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సరుబుజ్జిలి మండలం కొండవలసకు చెందిన 7వ తరగతి చదువుతున్న దళిత బాలికపై లైంగిక దాడి చేసిన ఆటోడ్రైవర్ గేదెల సుధపై పోక్సో, అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్టు చేయాలని దళిత సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. శుక్రవారం జెఎసి నాయకులు విలేకరులతో మాట్లాడుతూ కేసు నమోదు చేసి మూడు రోజులు కావస్తున్నా నిందితుడిని అరెస్టు చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్న పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మైనర్ బాలికలపై రోజురోజుకు పెరిగిపోతున్న దాడుల నేపథ్యంలో హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పోలీస్ యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడాన్ని దళిత సంఘాల జెఎసి నాయకులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే గేదెల సుధను అరెస్ట్ చేయకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దళిత సంఘాల జెఎసి జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్. కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గిరిధర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాదక ద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్‌పై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం గంజాయి విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి సేవనం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.ఎ.రాములు, టింగరాజు, ఎస్‌సి, ఎస్‌టి టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల డేనియల్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు పైడి రామస్వామి నాయుడు, జనసాహితీ జిల్లా కార్యదర్శి పసిడి మొగ్గ మోహనరావు, ఇన్‌ఛార్జి హెచ్ఎం పైల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం రీ పేమెంట్ ఉండాలి

ప్రజాశక్తి- మందస

మహిళా సంఘాలు మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంపొందించు కోవడంతో పాటు, గృహ వినియోగానికి తీసుకున్న అన్ని రకాల రుణాలకు శతశాతం రీపేమెంట్ ఉండాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందసలో తీసుకున్న శ్రీనిధి రుణాలను వాయిదాలు సక్రమంగా చెల్లించనందున తక్షణమే రికవరీ చేయాలని సూచిస్తూ సభ్యులకు అవగాహన కల్పించారు. వాయిదాలు సక్రమంగా చెల్లించిన గ్రామ సంఘాల్లో సభ్యులకు అతి తక్కువ వడ్డీ కేవలం 92 పైసలకే ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా రుణాలను మంజూరు చేస్తున్నట్లు వివరించారు.


మాట్లాడుతున్న కూర్మారావు

పాత అప్పును వాయిదాల ప్రకారం చెల్లించే వారికి కేవలం 48 గంటల్లోనే సంఘానికి రూ.8 లక్షల వరకు ఏ బ్యాంకుల చుట్టూ తిరగకుండా బయోమెట్రిక్ వేయించి రుణం మంజూరు చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ బాలకృష్ణ, శ్రీనిధి మేనేజర్ కె.రాము, విఒఎలు గాయత్రి, శారద తదితరులు పాల్గొన్నారు.

24న వినియోగదారుల హక్కుల దినోత్సవం


పోస్టర్ అవిష్కరిస్తున్న ఆశ్రా అధ్యక్షులు డాక్టర్ ఎజ్రా

శ్రీకాకుళం సిటీ: జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకలకు విజవంతం చేయాలని జిల్లా ఆశ్రా అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా పిలుపు నిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ చాంబర్స్‌లో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ పోస్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 24న పట్టణంలో జరగనున్న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకల్లో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వినియోగ దారుల హక్కుల పరిరక్షణకు పాటుపడే సంఘాలన్ని భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు శాసపు జోగి నాయుడు, పీజీ గుప్తా, ఈశ్వరరావు, గుడ్ల గోపాలరావు, మెట్ట దనుంజయ భట్ల, ఆసరా ప్రతినిధులు కె.పి.సారధి, కిరణ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా పని చేయాలని ఉత్తరాంధ్ర కళింగ సంఘ నాయకుడు పేడాడ జనార్ధనరావు అన్నారు. శుక్రవారం ఇటీవల జిల్లా టిడిపి అధ్యక్షుడిగా మొదలవలస రమేష్ నియామకం సందర్భంగా ఉత్తరాంధ్ర కళింగ సంఘ నాయకుడు జనార్ధనరావు రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధనరావు మాట్లాడుతూ అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకు సాగాలన్నారు. అలాగే ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈ నెల 28న ఎచ్చెర్ల సమీపంలోని చౌదరి సత్యనారాయణ తోట వద్ద నిర్వహించనున్న కళింగ వనభోజన కార్యక్రమ ఏర్పాట్లపై


రమేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జనార్ధనరావు

జనార్ధనరావు, కళింగ సంఘ నాయకులతో కలిసి కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర కళింగ సంఘ నాయకులు సనపల రమణారావు, కంచరాన మురళీధరరావు, వెంకట్రావు, టి.ఎ.నాయుడు, జి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న అధికారులు

ఎంఒఆర్‌డి బృందం పర్యటన

మెళియాపుట్టి: ఉపాధిహామీలో భాగంగా చేసిన ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాంట్స్ పనులను గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ బృందం శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా వి.సుగుణాకరరావు (సెంట్రల్ గ్రౌండ్ వాటర్ మిషన్) అధికారి మండలంలోని మెళియాపుట్టి, సుందరాడ, చాపర, మూల నేలబొంతు, పొగడ వెల్లి, దబ్బగూడ, జోడూరు తదితర గ్రామాలను సందర్శించి చిన్న నీటి కుంటలు, ఇంకుడు గుంతలు పరిశీలన చేశారు. పనులను నాణ్యతయుతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ పనుల్లో భూగర్భ జలాలు సంరక్షించడానికి ఉపయోగపడే అనేక రకాలైన ప్రాజెక్టులు ఉన్నాయని, వాటి ద్వారా అధిక పనులు జరిగే విధంగా అంచనాలు తయారు చేసి గ్రామాల్లో పనులు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు జిల్లా విభాగం అధికారి శోభారాణి, ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే చొరవతో సమస్యల పరిష్కారం

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో వచ్చే అర్జీల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవ అద్భుతమని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆమెతో పాటు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని శ్రీనివాసరావు, పివికె రాజు, నాగళ్ల మరళీధర్ యాదవ్, అన్నెపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట పంచాయతీ ఏర్పాటు చేయాలి

వజ్రపుకొత్తూరు: కొత్తగా హుకుంపేట పంచాయతీ ఏర్పాటు చేయాలని స్థానికులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాను కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. పల్లివూరు పంచాయతీలో 12 గ్రామాలున్నాయని, వీటిలో హుకుం పేట పెద్ద గ్రామమని, ఆ గ్రామంలో సుమారు 2వేల మంది ఓటర్లు, 3500 మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. వివిధ పనులపై పల్లివూరు సచివాలయానికి వెళ్లడానికి సుమారు మూడు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. ఐదేళ్లకొకసారి ఎన్నికలు జరిగేటప్పుడు వృద్ధులు, వికలాంగులు, ప్రజలు పోలింగ్‌బూత్‌కు సచివాలయానికి వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని హుకుంపేట గ్రామాన్ని కొత్త పంచాయతీగా ఏర్పాటుకు ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వంక రామారావు, గోవింద, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ పరామర్శ

మెళియాపుట్టి: మండలంలోని పాతపట్నానికి చెందిన విలేకరి నిరంజన్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నిరంజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అలాగే బూరగాంలో మృతి చెందిన రమేష్ స్వాయ్ కుటుంబాన్ని పరామర్శించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.